క్లుప్తంగా

చిన్నారుల ఆరోగ్యంపై శ్రద్ధ

- అర్బన్ సీడీపీఓ జి. ప్రసన్న



చిన్నారికి మందు వేస్తున్న సీడీపీఓ ప్రసన్న

విజయనగరం ఫోర్ట్: పిల్లల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని ఐసీడీఎస్ అర్బన్ పీఓ జి. ప్రసన్న సూచించారు. శనివారం స్థానిక దాసన్నపేట అంగన్వాడీ కేంద్రంలో రాష్ట్రీయ పోషణ మాసోత్సవాల్లో భాగంగా అవగాహన సదస్సు నిర్వహించారు. అదేవిధంగా పిల్లలకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గర్భిణులు ప్రతిరోజూ పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. అంగన్వాడీల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్వైజర్ మేరీ వనిత, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ తప్పనిసరి



పౌష్టికాహార ప్రదర్శనలో వైద్యాధికారులు అనిల్, పద్మావతి, తదితరులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని దన్నాన్నపేట అంగన్వాడీ కేంద్రంలో 8వ జాతీయ పోషణ మాసం కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సతివాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులు అనిల్ కుమార్, పద్మావతి హాజరై గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహార ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. సమయానికి టీకాలు వేయించుకోవడం, క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవడం, పౌష్టికాహారం తీసుకోవడం మరిచిపోకూడదన్నారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందజేస్తున్న సరుకులను గర్భిణీలు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్వైజర్ బి.శారద, సారిపల్లి ఐసీడీఎస్ సెక్టార్ అంగన్వాడీ టీచర్లు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

సందర్శన



విద్యార్థులు తయారు చేసిన డ్రోన్‌ను పరిశీలిస్తున్న డీఈఓ మాణిక్యాలనాయుడు, తదితరులు

పూసపాటిరేగ: మండలంలోని రెల్లివలస జెడ్పీ ఉన్నత పాఠశాలను డీఈఓ మాణిక్యాలనాయుడు శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి వారి సామర్థ్యాలను అంచనా వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులను గ్రేడ్‌లుగా విభజించి తరగతులు నిర్వహించాలన్నారు. విద్యార్థులు తయారుచేసిన డ్రోన్ 3డీ మోడల్స్ రోబోటిక్స్‌ను పరిశీలించి గైడ్ టీచర్ అమరనాథ్‌ను అభినందించారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం బి. శంకరరావు, ప్రజాప్రతినిధులు ఎంవీజీ శంకరరావు, ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాలను వెలికితీయాలి



మాట్లాడుతున్న మాన్సాస్ కరస్పాండెంట్ లక్ష్మీపతిరాజు

విజయనగరం టౌన్: విద్యార్థుల్లో దాగిఉన్న నైపుణ్యాలను వెలికితీయాలని మాన్సాస్ కరస్పాండెంట్ లక్ష్మీపతిరాజు అన్నారు. శనివారం స్థానిక మహారాజా ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాలలో వికసిత్ భారత్ సేవాపర్వ్‌లో భాగంగా చిత్రకళ సమ్మేళనం, యూత్ ఇంట్రాక్షన్, ఐడియా షేరింగ్ వంటి అంశంపై డిబేట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు డిబేట్‌లో పాల్గొనడం అభినందనీయమన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మండపాక నాగలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో భాషా సాంస్కృతిక శాఖ ఫీల్డ్ ఆఫీసర్ బీఎస్ఎస్.ప్రసాద్, కళాశాల పూర్వ విద్యార్థుల సంఘ కార్యదర్శి బూరాడ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే క్షమాపణ చెప్పాలి

విజయనగరం టౌన్: నాయీ బ్రాహ్మణులను కులంపేరుతో దూషించిన బాపట్ల ఎమ్మెల్యే నరేంద్ర వర్మ తక్షణమే క్షమాపణ చెప్పాలని నాయీ బ్రాహ్మణ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు టీవీ దుర్గారావు శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. బాపట్ల శాసనసభ్యుడు నరేంద్రవర్మ అక్కడి మెడికల్ కాలేజ్ పరిశీలనకు వెళ్లి నాయీ బ్రాహ్మణ కులాన్ని అవమానపరిచారని పేర్కొన్నారు. వెంటనే ఆయన క్షమాపణ చెప్పాలని, లేని ఎడల ఆందోళన చేపట్టక తప్పదని స్పష్టం చేశారు.

ముమ్మాటికీ అవమానించడమే..

- ఎవరికి చెప్పి ఫ్లెక్సీలు తొలగించారు
- కౌన్సిల్ సమావేశంలో నిల్చొని నిరసన తెలియజేసిన కార్పొరేటర్లు
- పలు సమస్యల పరిష్కారంపై చర్చించిన కౌన్సిల్ సభ్యులు
- 18 అంశాలకు ఆమోదం



సమావేశానికి హాజరైన కార్పొరేటర్లు



మాట్లాడుతున్న కమిషనర్ నల్లనయ్య

విజయనగరం: కౌన్సిల్ తీర్మానం చేసిన నిర్ణయాలను అమలు చేయాలే కాని.. అధికారులు నిర్ణయాలు తీసుకుని కౌన్సిల్‌కు చెప్పడం సరికాదని విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ ఫ్లోర్‌లీడర్ శెట్టివీరవెంకట రాజేష్, కో ఆప్షన్ సభ్యుడు ఆశపు వేణు, ఇతర కార్పొరేటర్లు అన్నారు. ఈ మేరకు అధికారుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇటీవల నగరంలో జరిగిన ఫ్లెక్సీల వివాదంలో అధికారులను తీరును కార్పొరేటర్లందరూ ముక్తకంఠంతో తప్పుబట్టారు. స్వయానా కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి పేరిట ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలపై వేరొక రాజకీయ పార్టీ నాయకులు ఫ్లెక్సీలు పెట్టడంతో పాటు వివాదానికి తెరలేపడాన్ని తీవ్రంగా ఖండించారు. ఆ సందర్భంలో కౌన్సిల్ సభ్యులకు కనీస సమాచారం ఇవ్వకుండా నగరంలో ఫ్లెక్సీలు తొలగించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. శనివారం స్థానిక కౌన్సిల్ సమావేశంలో నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన సమావేశంలో అధికారుల తీరుపై కార్పొరేటర్లందరూ నిల్చొని నిరసన వ్యక్తం చేశారు. కౌన్సిల్ సభ్యులకు ఇవ్వాల్సిన ప్రొటోకాల్ పాటించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. అదేవిధంగా నగరంలో ఏయే ప్రాంతాల్లో.. ఏయే సందర్భాల్లో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలన్న దానిపై స్టాండింగ్ కమిటీ సమావేశంలో చర్చించిన అనంతరం అన్ని రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు. మొత్తం 19 అంశాలతో కూడిన మూడు అజెండాలు ప్రవేశపెట్టగా.. అందులో ఒక్కటి మినహా మిగిలిన 18 అంశాలను కౌన్సిల్ ఆమోదించింది. సమావేశంలో ముందుగా ప్రజా సమస్యలను కార్పొరేటర్లు ప్రస్తావించగా.. కమిషనర్ నల్లనయ్య బదులిచ్చారు.

జాతరకు పక్కా ఏర్పాట్లు : మేయర్

పైడితల్లి జాతర నేపథ్యంలో భక్తులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి తెలిపారు. ఇప్పటికే నగరంలోని రహదారులకు మరమ్మతులు చేపడుతున్నట్లు చెప్పారు. వీధి దీపాల సమస్య లేకుండా చూడాలని అధికారులకు ఆదేశించామన్నారు. అందరి సమన్వయంతో జాతరను సమర్థవంతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ వెంపడాపు విజయలక్ష్మి

రోడ్డు నిర్మాణ పనులు అపేస్తారా..?

నగరంలోని 40వ డివిజన్‌లో కాంట్రాక్టర్ పనులు ప్రారంభించే సమయంలో కూటమి నేతల ఒత్తిళ్లతో ఓ లాయర్ ఇచ్చిన నోటీసుకు రోడ్డు నిర్మాణ పనులు నిలిపివేయడాన్ని ఫ్లోర్‌లీడర్ రాజేష్, స్థానిక కార్పొరేటర్ బోనెల ధనలక్ష్మి, తదితరులు ఖండించారు. ఎటువంటి న్యాయపరమైన అడ్డంకులు లేకుండా కేవలం కుట్ర రాజకీయాల కారణంగా పనులు ఆపేయడం తగదన్నారు. కౌన్సిల్ నిర్ణయం మేరకు పనులు చేపట్టాలని, ఏమైనా న్యాయపరమైన అడ్డంకులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. సోమవారం నుంచి పనులు ప్రారంభించకుంటే తామే అధికారులకు వ్యతిరేకంగా నిరసన చేపడతామని హెచ్చరించారు.

సమావేశంలో చర్చకు వచ్చిన మరికొన్ని అంశాలు..

- కౌన్సిల్ సమావేశంలో అధికారులు అత్యవసర అంశమంటూ టేబుల్ అజెండాలు ప్రవేశపెట్టి ఆమోదించుకోవడాన్ని ఫ్లోర్ లీడర్ రాజేష్ తప్పుబట్టారు. ప్రతి మూడు నెలలకు జరిగే సాధారణ సమావేశాలు కాకుండా అత్యవసర సమావేశాలు నిర్వహించి కౌన్సిల్ దృష్టికి తీసుకురావాలన్నారు.
- కోట్లాది రూపాయాల ప్రజాధనం ఖర్చు చేస్తున్న నగరంలో ప్యాచ్ వర్క్ పనులు నాణ్యతా లోపంతో కొద్ది రోజులకే పాడవుతున్నాయని, అంతేకాకుండా కుక్కల దాడులతో నగర ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారని కార్పొరేటర్ మారోజు శ్రీనివాసరావు సభ దృష్టికి తీసుకువచ్చారు.
- తమ డివిజన్ పరిధిలో గల కామాక్షినగర్‌లో పార్కు నిర్మాణ పనులు ప్రారంభించడంతో పాటు అయ్యన్నపేట ప్రాంతంలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని కార్పొరేటర్ పిన్నింటి కళావతి కోరారు.
- 27వ డివిజన్ జొన్నగుడ్డిలో గతంలో తాగునీటి పైప్‌లైన్ల ఏర్పాటుకు రోడ్డును తవ్వారని, వాటిని పూడ్చకపోవడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారని కార్పొరేటర్ సభ దృష్టికి తీసుకువచ్చారు.
- మధుపాడ రక్షిత మంచినీటి పథకం నుంచి పంపింగ్ చేస్తున్న నీరు రంగు మారడంతో ప్రజలు తాగేందుకు ఇబ్బంది పడుతున్నారని కార్పొరేటర్లు తెలిపారు.
- కేఎల్‌పురంలో రోడ్డును ఆక్రమించి ఇళ్లు నిర్మించుకుంటున్నట్లు స్థానిక రైతులు, తాను ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోకపోవడాన్ని కార్పొరేటర్ తాళ్లపూడి సంతోషి ఆవేదన వ్యక్తంచేశారు. తక్షణమే ఆ నిర్మాణ పనులు నిలుపుదల చేసి ఆక్రమణలు తొలగించాలని డిమాండ్ చేశారు. సమస్యలపై స్పందించిన ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్ అధికారులు వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని సమాధానమిచ్చారు. సమావేశంలో డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య, అసిస్టెంట్ కమిషనర్ కిల్లాన అప్పలరాజు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పీవీ ఎస్ఎస్ ప్రసాద్, ఏసీపీలు రమణమూర్తి, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్‌లను ప్రైవేట్ వారికి అప్పగించొద్దు



రిలే నిరాహార దీక్ష చేస్తున్న విద్యుత్ ఉద్యోగులు

- విద్యుత్ జేఏసీ ఛైర్మన్ సురగాల లక్ష్మణ్

విజయనగరం ఫోర్ట్: విద్యుత్ సబ్‌స్టేషన్‌లను ప్రైవేట వారికి అప్పగించవద్దని విద్యుత్ జట్సీ సురగాల లక్ష్మణ్ తెలిపారు. ఈ మేరకు శనివారం స్థానిక దాసన్నపేట సబ్‌స్టేషన్ వద్ద రిలే నిరాహార దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. ఉద్యోగులకు నాలుగు డీఏ బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. ఈపీఎఫ్, జీపీఎఫ్ అమలు చేసి అందరికీ పెన్షన్ సదుపాయం కల్పించాలన్నారు. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు బండారు రాజేష్‌కుమార్, పప్పల అప్పలస్వామినాయుడు, మందపల్లి నిర్మలామూర్తి, రుంకాన అప్పలనాయుడు, పి. సీతారామరాజు, నాగరాజు, గేదెల దేముడు, తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తం

విజయనగరం ఫోర్ట్: వర్షాకాలం నేపథ్యంలో జల ఆధారిత వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్ఓ జీవనరాణి శనివారం ఒక ప్రకటనలో సూచించారు. విరేచనాలు, వాంతులు, నీరసం వంటి లక్షణాలున్న వెంటనే సమీపంలోని ప్రభుత్వాస్పత్రికి వెళ్లి వైద్యసేవలు పొందాలని పేర్కొన్నారు.

72 మందిపై బైండోవర్ కేసులు



తహసీల్దార్ కార్యాలయం వద్ద సతివాడ గ్రామస్తులు

నెల్లిమర్ల: మండలంలోని సతివాడ గ్రామానికి చెందిన 72 మందిపై పోలీసులు బైండోవర్ కేసులు నమోదు చేశారు. ఇటీవల గ్రామంలో నిర్వహించిన గణేష్ ఉత్సవాల్లో స్థానిక ఎస్సీ, బీసీ వర్గాల మధ్య వివాదం చోటు చేసుకున్న విషయం తెలిసిందే. ఒక్కో వర్గానికి చెందిన 36 మంది చొప్పున మొత్తం 72 మందిపై పోలీసులు ఇప్పటికే ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. గ్రామంలోఎటువంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా 72 మందిపై బైండోవర్ నమోదైంది. ఎస్సై గణేష్ సమక్షంలో బైండోవర్ నమోదైన ఇరువర్గాలు తహసీల్దార్ శ్రీకాంత్ ఎదుట శనివారం హాజరయ్యారు.

అన్నదానం



భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న ఆలయ ట్రస్ట్ ఛైర్మన్ శంకర్‌రెడ్డి

విజయనగరం టౌన్: నగరంలోని కంటోన్మెంట్ గూడ్స్‌షెడ్ వద్దనున్న సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ ఆవరణలో ఆలయ ఛైర్మన్ రెయ్యి శంకర్ రెడ్డి ఆధ్వర్యంలో శనివారం సుమారు రెండు వేల మంది భక్తులకు అన్నదానం నిర్వహించారు. మాస శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని అన్నదానం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ కె.పద్మావతి, కమిటీ ప్రతినిధులు ప్రసాద్, శోభారాణి, భీమ, సోమశేఖర్ శర్మ, తదితరులు పాల్గొన్నారు.

సమాజ వెలుగుజాడ గురజాడ..



మహాకవి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఆర్‌బీ రామానాయుడు, తదితరులు



విజయనగరం అర్బన్: కన్యాశుల్కం కళాకారులను సత్కరించిన సీతం ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ శశిభూషణరావు, తదితరులు



విజయనగరం అర్బన్: గురజాడ పాఠశాలలో చిన్నారుల గురజాడ వేషధారణ

విజయనగరం టౌన్: సమాజానికి వెలుగుజాడ గురజాడ అని తెలుగుభాషా సేవాసంఘం అధ్యక్షుడు ఆర్‌బీ రామానాయుడు అన్నారు. శనివారం స్థానిక గాజులరేగ నారాయణ పబ్లిక్ స్కూల్‌లో మహాకవి గురజాడ వెంకటఅప్పారావు 163వ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహాకవి చిత్రపటానికి పూలమాలలేసి నివాళుర్పించారు. పాఠశాల విద్యార్థి జి.చైతన్య చక్రవర్తి గురజాడ వేషధారణలో అలరించాడు. గురజాడ దేశభక్తి గేయాలపై పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా రామానాయుడు మాట్లాడుతూ.. తెలుగుసాహిత్యాన్ని సుసంపన్నం చేసిన గొప్ప సాహితీకారుడు గురజాడ అని తెలిపారు. పాఠశాల కరస్పాండెంట్ మొయిద నారాయణరావు మాట్లాడుతూ.. సమాజాన్ని పట్టి పీడిస్తున్న రుగ్మతలను రూపుమాపే నాటకాలు, రచనలు చేసిన అభ్యుదయ కవి గురజాడ అని కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యాలయాల్లో మహాకవి జయంతి..

విజయనగరం అర్బన్: పట్టణంలోని వివిధ విద్యాలయాల్లో మహాకవి, సంఘసంస్కర్త గురజాడ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. స్థానిక సత్య డిగ్రీ కళాశాలలో డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో ముందుగా గురజాడ చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. అనంతరం అతిథులుగా హాజరైన కన్యాశుల్కం నాటకం కళాకారులు సూర్యలక్ష్మి భోగరాజు, సామవేదుల సత్యలత, ఉదయగిరి నీలిమ, సామవేదుల గీతారాణి, సీహెచ్ రాజకుమారి, ముళ్లపూడి సుభద్రదేవి, చీకటి చంద్రికరాణి, హన్సాజ, నాటక దర్శకుడు ఈపు విజయ్‌కుమార్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ సాయిదేవమణి, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న విద్యార్థుల గురజాడ వేషధారణ

పట్టణంలోని గురజాడ పాఠశాలలో మహాకవి గురజాడ అప్పారావు జయంతి నిర్వహించారు. తొలుత గురజాడ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చిన్నారుల వేషధారణలు అలరించాయి. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పూడి శేఖర్, ఉపాధ్యాయులు, చిన్నారులు పాల్గొన్నారు.

ఎంవీజీఆర్ కాలేజ్‌లో హ్యాకథాన్



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శేఖర్

డెంకాడ: ఎంవీజీఆర్ కాలేజ్‌లో కంప్యూటర్ సైన్సు, ఇంజినీరింగ్ ఐటీ, డీఈ విభాగాల ఆధ్వర్యంలో శనివారం ఇంట్రా-కాలేజ్ 24 గంటల హ్యాకథాన్ సంకల్ప్‌ను ప్రిన్సిపాల్ డాక్టర్ వైఎంసీ శేఖర్, సీఎస్ఈ విభాగాధిపతి డాక్టర్ అరుణ శ్రీనివాస్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. భవిష్యత్ సాంకేతిక నిపుణులను రూపొందించడంలో ఆవిష్కరణలపై అవగాహన కల్పించారు. హ్యాకథాన్‌లో విజేతగా నిలిచిన వారికి రూ. 30 వేల నగదు బహుమతి ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో హ్యాకథాన్ కో ఆర్డినేటర్ డాక్టర్ రామ్‌సంతోష్ నాయుడు పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యకర సమాజం



పూసపాటిరేగ: తమ్మయ్యపాలెం బీచ్‌లో చెత్తాచెదారాలను తొలగిస్తున్న జిల్లా ఫారెస్ట్ అధికారి కొండలరావురెడ్డి , రామరమేష్, తదితరులు

- డీఎఫ్ఓ కొండలరావు రెడ్డి

పూసపాటిరేగ: పరిశుభ్రతతోనే ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుందని జిల్లా ఫారెస్ట్ అధికారి కొండలరావు రెడ్డి అన్నారు. మండలంలోని తీర ప్రాంతమైన తమ్మయ్యపాలెం బీచ్‌లో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం చెత్తాచెదారాలను ఏరివేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నపుడు పర్యావరణానికి ముప్పు ఏర్పడదన్నారు. అలాగే వ్యక్తిగత పరిశుభ్రతకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఫారెస్ట్ రేంజర్ రామరమేష్, ఫారెస్ట్ సెక్షన్ అధికారి మధుమోహన్, అసిస్టెంట్ బీట్ అధికారులు పూజ, భారతి, తదితరులు పాల్గొన్నారు.

భాగస్వాములు కావాలి..



నెల్లిమర్ల: మొక్క నాటుతున్న నగర పంచాయతీ ఛైర్‌పర్సన్ సరోజిని

నెల్లిమర్ల: స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని నగర పంచాయతీ ఛైర్‌పర్సన్ బంగారు సరోజిని, కమిషనర్ టి. జయరామ్ పిలుపునిచ్చారు. స్థానిక గాంధీనగర్ కాలనీలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా పరిసరాల పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో మెప్మా సీఎంఎం జి. రాము, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉమాభాస్కర్, నాయకులు జనాప్రసాద్, అప్పికొండ రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

స్కౌట్స్ శిక్షణ శిబిరాన్ని సందర్శించిన ఎమ్మెల్సీ



స్కౌట్ మాస్టర్లు రూపొందించిన టెంట్లు, గాడ్జెట్లు, పయొనీరింగ్ ప్రాజెక్టులను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ డాక్టర్ గాదె

విజయనగరం అర్బన్: భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ప్రాంతీయ శిక్షణ కేంద్రంలో కొనసాగుతున్న అడ్వాన్స్‌డ్ కోర్స్ ఫర్ స్కౌట్ మాస్టర్స్ శిక్షణ శిబిరాన్ని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ డాక్టర్ గాదె శ్రీనివాసులునాయుడు శనివారం సందర్శించారు. ఉమ్మడి విజయనగరం జిల్లాలోని 32 పాఠశాలలకు చెందిన స్కౌట్ ఉపాధ్యాయులకు ఇస్తున్న శిక్షణ 21వ తేదీతో ముగియనుంది. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. సబ్జెక్ట్ బోధనతో పాటు విద్యార్థుల్లో స్కౌటింగ్ నైపుణ్యాలు, దేశభక్తి, నిజాయితీ, క్రమశిక్షణ, సేవాభావాన్ని పెంపొందించే బాధ్యత అభినందనీయమన్నారు. శిక్షణ కేంద్రానికి రహదారి, కనీసం 200 మంది ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉండేలా డార్మిటరీ నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా స్కౌట్ మాస్టర్లు రూపొందించిన టెంట్లు, గాడ్జెట్లు, పయొనీరింగ్ ప్రాజెక్టలను పరిశీలించిన ఎమ్మెల్సీ వారి ప్రతిభను అభినందించారు. కార్యక్రమంలో లీడర్ ఆఫ్ ది కోర్సు వాక చిన్నంనాయుడు, ఈపు విజయ్ కుమార్, బీపీఏ రాజు, సీహెచ్ నారాయణమూర్తి, వేమలి త్రినాథనాయుడు, డి.ప్రవీణ్‌కుమార్, ఎ.దుర్గానాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.


ఘనంగా రామాయణ శంఖారావం



రామాయణ శంఖారావం కార్యక్రమంను జ్యోతి ప్రజల్వన చేసి ప్రారంభిస్తున్న అతిథులు

విజయనగరం రూరల్: ప్రముఖ ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రమైన రామనారాయణంలో శ్రీ రామాయణ శంఖారావం కార్యక్రమంలో భాగంగా శనివారం ఉదయం జాతీయస్థాయి లీగల్ కాంక్లేవ్ ఘనంగా ప్రారంభమైంది. ఈ ఉత్సవాన్ని తెలంగాణ రాష్ట్రానికి చెందిన జస్టిస్ టి. మాధవీదేవి, జస్టిస్ సూరేపల్లి నంద, దామోదరం సంజీవయ్య నేషనల్ లా యూనివర్సిటీ ఉప కులపతి ప్రొఫెసర్ డి. సూర్యప్రకాష్, తదితరులు జ్యోతి ప్రజ్వలనం చేసి ప్రారంభించారు. ఈ సదస్సులో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు విశ్రాంత జడ్జి డాక్టర్ జి. యతిరాజులు, సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది పి. శ్రీధర్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ హైకోర్టులకు చెందిన న్యాయవాది సీవీఎల్ నరసింహారావు, తెలంగాణ హైకోర్టు న్యాయవాది ఎం. వెంకటేశ్వరి, సుప్రీంకోర్టు న్యాయవాది నిహారిక రెడ్డి, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు విశ్రాంత జడ్జి యు. దుర్గాప్రసాదరావు, తెలంగాణ హైకోర్టు న్యాయవాది శ్రీధర్, సైబర్ లా స్పెషలిస్ట్ డాక్టర్ సాయి సుశాంత్ సముద్రాల, తెలంగాణ హైకోర్టు న్యాయవాది టీఎస్ శుభ రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు. సదస్సులో ముందుగా వేద పాఠశాల విద్యార్థులు వేద పఠనం చేశారు. రామాయణంలోని నైతిక విలువలు, న్యాయం, సమానత్వం వంటి అంశాలు భారత రాజ్యాంగ మూలసూత్రాలతో ఎలా కలుస్తాయో చర్చించారు. సమావేశంలో ఎస్‌సీఎస్ చారిటబుల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారాయణం నాగేశ్వరరావు, ట్రస్టు సభ్యులు నారాయణం శ్రీనివాస్, వాల్మీకి రీసెర్చ్ సెంటర్ డైరెక్టర్ హెచ్. లజపతిరాయ్, కో ఆర్డినేటర్ నారాయణం గౌరీ నిత్య, తవాస్మి అకాడమీ శ్రీరామ చక్రధర్, డైరెక్టర్లు శారదా దీప్తి , జాహ్నవి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రాజధానిలో ఘంటసాల విగ్రహం ఏర్పాటు చేయాలి



ఘంటసాల విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఆలిండియా ఘంటసాల చైతన్యవేదిక జాతీయ అధ్యక్షుడు కోట వెంకటేశ్వరరెడ్డి, తదితరులు

విజయనగరం టౌన్: నవ్యాంధ్ర రాజధాని అమరావతిలో 25 అడుగుల ఘంటసాల భారీ విగ్రహంతో పాటు ఘంటసాల కళాక్షేత్రాన్ని ఏర్పాటు చేయాలని ఆలిండియా ఘంటసాల చైతన్యవేదిక జాతీయ అధ్యక్షుడు కోట వెంకటేశ్వరరెడ్డి కోరారు. రాష్ట్రస్థాయి ప్రచార కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వానికి ఐదు విజ్ఞప్తులు చేస్తూ శనివారం స్థానిక మహారాజా ప్రభుత్వ సంగీత, నృత్యకళాశాలలో ఉన్న ఘంటసాల విగ్రహానికి పూలమాలలేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఘంటసాల తన జీవిత ప్రారంభంలో ఎన్నో కష్టాలను అనుభవించి, ఈ కళాశాలలోనే సంగీత విద్యనభ్యసించి సినీ రంగంలో రారాజుగా వెలుగొందారన్నారు. అటువంటి మహనీయుడి విగ్రహం రాజధానిలో ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. అమరావతిలో హైదరాబాద్ తరహాలో 100 మంది తెలుగు మహనీయుల విగ్రహాలతో కృష్ణా నదికి ఇరువైపులా ట్యాంక్‌బండ్ నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మండపాక నాగలక్ష్మి, ఘంటసాల స్మారక కళాపీఠం అధ్యక్ష, కార్యదర్శులు ధవళ సర్వేశ్వరరావు, భీష్మారావు, బుర్రా శ్రీనివాసరావు, బొత్స సూర్యనారాయణ, రాజేంద్రప్రసాద్, ఎస్‌వీఎస్ గుప్త, రాజేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.